సాక్షి
వనపర్తి
శుక్రవారం, 15, నవంబర్, 2024



కురుమతిగిరులు కిటకిట

ఉత్సవాలకు వస్తున్న భక్తులతో కురుమూర్తి స్వామి ఆలయం కిటకిటలాడుతోంది.

వివరాలు 8లో ▸



చాంపియన్ లింగాల

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో లింగాల గురుకుల విద్యార్థులు విజేతగా నిలిచారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.7 /21.7

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది. చల్లటి గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తెలంగాణ కబడ్డీ జట్టు కోచ్‌గా ఎంపిక



పెబ్బేరు రూరల్: తెలంగాణ కబడ్డీ జట్టు కోచ్‌గా పెబ్బేరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కురుమయ్య ఎంపికై నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 20 వరకు మధ్యప్రదేశ్‌లోని గధర్వార్ నర్సింగ్‌పూర్ జిల్లాలో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు.

మార్కెట్‌లో జోరుగా విక్రయాలు



జడ్చర్ల/బాదేపల్లి: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం పంట ఉత్పత్తులు పోటెత్తా యి. వివిధ ప్రాంతాల నుంచి 6,540 క్వింటాళ్ల ధాన్యం, 2,244 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,411, కనిష్టంగా రూ.1,200గా ధరలు లభించాయి. ధాన్యం హంస రకం గరిష్టంగా రూ.1,869, కనిష్టంగా రూ.1,827, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,697, కనిష్టంగా రూ.1,625, సోనా మసూరి రూ.1,611 , వేరుశనగ గరిష్టంగా రూ. 6,351, కనిష్టంగా రూ.5,127 ధరలు పలికాయి.

■ దేవరకద్ర మార్కెట్ కార్యాలయంలో జరిగిన ఈనామ్ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,409, కనిష్టంగా రూ.1,901గా ధరలు లభించాయి. మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కాగా.. గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం మార్కెట్‌కు సెలవు ఉంటుందని సెక్రటరీ జయలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు.

18న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

నారాయణపేట: మహబూబ్‌నగర్ జిల్లా ఐడీఓసీలో ఈనెల 18 సోమవారం ఉదయం 10:30 గంటలకు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ పర్యటన బి.వెంకటేశ్వరరావు బృందం నేతృత్వంలో సమావేశం ఉంటుందని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖలీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు డెడికేటెడ్ కమిషన్ బృందం సభ్యులకు నమోదిత లేదా నమోదు కాని అసోసియేషన్ సంఘాల ప్రజాప్రతినిధులు వారికి అవసరమైన రిజర్వేషన్, దామాషాను, వాదనలను, ఆక్షేపణలు, సలహాలు, అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. బీసీలకు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లను, దామాషాను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకునేందుకు ఈ బృందం పర్యటిస్తున్నట్లు తెలిపారు. నారాయణపేట జిల్లాలోని వివిధ సామాజిక వర్గాల వారు ఆసక్తి ఉన్నవారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బృందానికి తెలియజేయవచ్చని తెలిపారు.

సాగునీటికి అడ్డుకట్టేది?

మొరాయిస్తున్న జూరాల, రామన్‌పాడు షట్టర్లు



జూరాల ప్రధాన ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటరీ

- నీటి నిర్వహణకు అవస్థలు
- గతేడాది మరమ్మతు చేసినా ఫలితం శూన్యం
- యాసంగిలో తప్పని సాగునీటి కష్టాలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల, రామన్‌పాడు జలాశయాల కుడి, ఎడమకాల్వల హెడ్ రెగ్యులేటరీల షట్టర్లు మరమ్మతుల కారణంగా కిందికి దించే, పైకెత్తే సమయంతో మొరాయిస్తున్నాయి. దీంతో నీటి నిర్వహణకు అవరోధాలు ఎదురవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కాల్వలకు నీటిని విడుదల చేయడం, నియంత్రించడానికి క్షేత్ర సహాయ సిబ్బంది అవస్థలకు గురవుతున్నారు. ఏటా సకాలంలో నిర్వహణ లేకపోవడంతో హెడ్ రెగ్యులేటరీలతో పాటు ప్రధాన కాల్వలు, ఉప కాల్వల షట్టర్లు బిగుసుకుపోతున్నాయి. నీటి ఒత్తిడికి షట్టర్లకు ఉండే ఇనుప చువ్వలు ఒంగిపోతున్నాయి. ఉపకాల్వల షట్టర్ల రేకులు ఊడిపోతున్నాయి.



ఎడమకాల్వ షట్టర్‌కు సంబంధించి వంగిన రాడ్


మరమ్మతుల్లో జాప్యం..

నీటి విడుదల నిలిపివేస్తున్న సందర్భాల్లో షట్టర్లు ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నాయి. ఎగువ విభాగంలోని రెగ్యులేటరీ షట్టర్లతో పాటు ఇనుప చువ్వలను ఐదేళ్లలో మూడుసార్లు మార్చినా సమస్య తప్పడం లేదు. షట్టర్ల ఇనుప రాడ్ల జాయింట్లు ఊడిపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెగ్యులేటరీ వద్ద ఇనుప రాడ్ ఒంగిపోవడంతో నీటి విడుదలను నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. రామన్‌పాడ్ కుడి కాల్వ షట్టర్ల నిర్వహణ మూడేళ్లుగా విస్మరించడంతో పూర్తిస్థాయిలో నీటి విడుదలను అరికట్టలేని దుస్థితి నెలకొంది. షట్టర్ల మరమ్మతుకు రూ.9 లక్షలు సమకూరినా.. మరమ్మతుల్లో జాప్యం తప్పడం లేదు.

> **నివేదికలు సిద్ధం చేస్తున్నాం..**
>
> 
>
> జూరాల, రామన్‌పాడు జలాశయాల హెడ్ రెగ్యులేటరీల షట్టర్లపై క్షేత్రస్థాయిలో సిబ్బంది సమాచారం మేరకు నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నాం. నిధుల మంజూరుకు సంబంధించిన ఆదేశాలు వస్తేనే అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. వచ్చే వేసవిలో ప్రధాన షట్టర్ల మరమ్మతులు పూర్తి చేయనున్నాం.
>
> – జగన్మోహన్, ఈఈ, జూరాల జలాశయం ఎడమకాల్వ విభాగం

సారం కోల్పోతున్న భూములు..

లీకేజీలతో ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగడంతో పొలాల్లో నీరు నిల్వ ఉండి భూ సారం కోల్పోతున్నాయి. అలాగే జలాశయాల్లో నీటిమట్టం కనిష్టస్థాయికి చేరి ఆయకట్టుకు సాగునీరు అవసరం లేని సందర్భాల్లోనూ నిల్వ ఉన్న నీరు షట్టర్ల ద్వారా వృథాగా పారుతోంది. గతేడాది యాసంగి సీజన్‌లో జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో పంటల విరామం ప్రకటించారు. అప్పట్లో ప్రధాన కాల్వలతో పాటు ఉప కాల్వల షట్టర్లు మరమ్మతుల కారణంగా నీరు బయటకు పారుతున్నా మరమ్మతులు చేపట్టలేకపోయారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినా.. శాసనసభ ఎన్నికల సందర్భంగా నిధులు మంజూరు కాలేకపోయాయి. రామన్‌పాడును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా భావిస్తూ ఎప్పటికీ నీటిని నింపుతుండటంతో ప్రధాన షట్టర్ల మరమ్మతులు మరుగునపడ్డాయి.



జూరాల నుంచి రామన్‌పాడుకు నీటి ప్రవాహం

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. హాజరైన జిల్లా అధికారులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కోరారు. ఈడబ్ల్యూఐడీసీశాఖకు కేటాయించిన 18 అంగన్‌వాడీల్లో మరుగుదొడ్ల పనులు ప్రారంభం కాకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో పూర్తిచేసి యూసీ సమర్పించాలని.. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, ఈడబ్ల్యూఐడీసీ ప్రణాళిక అధికారి భూపాల్‌రెడ్డి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్ల బాధ్యత సూపర్‌వైజర్లదే..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లను పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లదేనని.. ప్రతి సూపర్‌వైజర్ పది సర్వే ఫారాలను తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఫారంపై సూపర్‌వైజర్ పరిశీలించినట్లు సంతకం ఉండాలన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు చేయకుండా ప్రతి ఒక్క ప్రశ్నకు జవాబు పూరించేలా చూడాలని కోరారు. కొత్త కాలనీలుంటే ఎన్యుమరేషన్ బ్లాక్ నంబర్ ఇచ్చి సర్వే పూర్తి చేయాలని సూచించారు. సర్వే 26వ తేదీలోగా పూర్తి కావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సహజ వనరులను సంరక్షించాలి

వనపర్తిటౌన్: పరిశ్రమలు, పట్టణాల్లో వెలుస్తున్న కొత్త కొత్త వ్యాపారాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారి ఆధిపత్యం పెరుగుతుండటంతో స్థానికులకు అన్యాయం జరుగుతోందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో బుధవారం రాత్రి 'ఉపాధి, ఉద్యోగ, వ్యాపారుల్లో స్థానికులకు అవకాశాలు.. సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువతరం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని.. పాలమూరు పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మున్ముందు ఉపాధి అవకాశాలు ఏ మాత్రం దక్కవని, ఇందుకోసం చర్చను విస్తృతంగా ప్రారంభించి పోరాటం దిశకు తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, ప్రజాసంఘాలు గళం విప్పాలని, ఎమ్మెల్యేలు స్థానికులకు అవకాశాల కల్పించేందుకు ఒత్తిడి పెంచాలని, ప్రజల వాదనలు వినిపించే వ్యక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడే వ్యక్తుల డిమాండ్లకు రాజకీయ పార్టీలు తలొగ్గి తీరాల్సిందేనన్నారు. స్థానిక వ్యాపారాలు, పరిశ్రమల్లో స్థానికులకే అవకాశాలు కల్పించాలంటూ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాలమూరులో కరువు పోలేదని.. సహజ వనరులు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల సహజ వనరులు లూటీ చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు షావుకారి శాంతన్న, వెంకటేశ్వర్లుశెట్టి, ఐ.నారాయణ, ప్రజా సంఘాల ప్రతినిధులు యోసేపు, వేణుగోపాల్, చిన్నరాములు, జనజ్వాల, నాగరాజు, గోపాలకృష్ణ, స్వరాజ్యం, వెంకట్‌నారాయణ, అంబటిస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.రాఘవాచారి

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం సరికాదు



గోపాల్‌పేటలో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

గోపాల్‌పేట: కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తక్షణమే కొనుగోలు చేయాలని.. కాలయాపన చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాయని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, తాడిపర్తి వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారం కిందట ధాన్యం తీసుకొచ్చామని.. ఇంకా కొనుగోళ్లు చేపట్టడం లేదని గోపాల్‌పేటలో కొందరు రైతులు వారి బాధను అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. కేంద్రం ప్రారంభించి మూడు రోజులైనా ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని స్థానిక అధికారులను ప్రశ్నించారు. హమాలీలు రావడం లేదని బదులివ్వగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ తిలక్‌రెడ్డి, ఆర్‌ఐ యాదయ్య తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 26295 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

17న హ్యాండ్‌బాల్ పోటీలు

జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల పోటీలను ఈ నెల 17న జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణిలు ఆధార్ కార్డ్ లేదా పుట్టిన తేది సర్టిఫికెట్‌తో తమను సంప్రదించాలని, వివరాలకు 99485 89065ను సంప్రదించాలని కోరారు.

మహనీయుడు చాచా నెహ్రూ



నెహ్రూకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్/వనపర్తి విద్యావిభాగం: సుఖంగా జీవించగలిగే అన్ని సౌకర్యాలు, వసతులు ఉండి కూడా దేశాభివృద్ధికి నిరంతరం పాటుపడిన మహోన్నతుడు చాచా నెహ్రూ అని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ కొనియాడారు. గురువారం కాంగ్రెస్‌పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, కార్యనిర్వాహక అధ్యక్షుడి ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయం ఎదుట, జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయంలో లైబ్రరీ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి వేర్వేరుగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత ప్రధాని హోదాలో నెహ్రూ వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. నెహ్రూ దార్శనికత, నిరాడంబరత నేటితరం తెలుసుకోవాలన్నారు. చిన్నారులపై ప్రేమ, ఆప్యాయత, అనురాగం కలిగి ఉండే నెహ్రూ జయంతిని భారతవని బాలల దినోత్సవంగా జరుపుకొంటుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కదిరె రాములు, పుర చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, నాయకులు ఎల్.సతీష్, లైబ్రేరియన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన దిశగా..

పీయూ అడ్మినిస్ట్రేషన్‌లో మొదలైన మార్పులు

- ఆ విభాగంలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన సిబ్బంది
- గత వీసీ హయాంలో జరిగిన అక్రమాలకు దన్నుగా నిలిచారని ఆరోపణలు
- ఎక్కువ కాలం నుంచి పనిచేస్తున్న వారిని తప్పించాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- కిందిస్థాయి సిబ్బందిని మార్పు చేయనున్నట్లు గుసగుసలు



పీయూ ముఖద్వారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కొత్త వైస్ చాన్స్‌లర్‌గా జీఎన్ శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అడ్మినిస్ట్రేషన్ విభాగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్) డైరెక్టర్‌గా నూర్జహాన్‌ను నియమించారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో కీలక పోస్టు అయిన రిజిస్ట్రార్‌ను నూతనంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నప్పను నియమించారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు పీయూ వీసీతో పాటు ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చాలాకాలంగా అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పాతుకుపోయిన పలువురు సిబ్బందిని కూడా మార్పులు చేయనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎప్పటి నుంచో విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్న ప్రధాన డిమాండ్ ఇదే.

పెద్దఎత్తున అక్రమాలు..

గత వీసీ హయాంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కొత్త వీసీతో సహ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కూడా ఫిర్యాదులు చేశారు. దీంతో ఈ విషయాన్ని అటు ప్రభుత్వం, ఇటు కొత్త వైస్‌చాన్స్‌లర్ కూడా సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు అప్పట్లో జరిగిన పలు అక్రమాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తెలుస్తుంది. వీరి వ్యవహారం కూడా అధికారుల దృష్టికి రావడంతో వీరిని కూడా మార్పు చేసే అవకాశం ఉన్నట్లు యూనివర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సమూల మార్పులు, పారదర్శక పాలన ఉండాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన వీసీల సమావేశంలో సూచించారు. ఇందుకు అనుగుణంగా మార్పులు, చేర్పులకు వీసీ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది.

కొత్త జట్టు కూర్పు..

పూర్తిస్థాయిలో యూనివర్సిటీని గాడిలో పెట్టేందుకు కొత్త జట్టును సిద్ధం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. గత వీసీ పీయూలో ఉన్న సీనియర్ అధ్యాపకులు గిరిజ, పవన్‌కుమార్‌లను రిజిస్ట్రార్‌లుగా నియమించారు. ప్రస్తుత వీసీ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రిజిస్ట్రార్‌ను నియమించుకున్నారు. మరీ ముఖ్యంగా యూనివర్సిటీకి సంబంధించి నిర్ణయాలు తీసుకునేందుకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో 13 మంది సభ్యులను కూడా త్వరలో నియమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం వాటిని ఆమోదించాల్సి వస్తుంది. వీరితో పాటు యూజీ, పీజీ జాయింట్ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, వివిధ డిపార్ట్‌మెంట్ల కోఆర్డినేటర్ పదవులకు సంబంధించి మార్పులు, చేయాల్సి ఉంది. కొన్ని పోస్టులు ఒక్కరి దగ్గరే ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. త్వరలో యూనిర్సిటీని న్యాక్ బృందం సందర్శించనున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో సిబ్బంది మార్పులు జరగనున్నట్లు తెలుస్తుంది.



పీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చెన్నప్ప

> **మెరుగుపరుస్తాం..**
>
> 
>
> యూనివర్సిటీని త్వరలో న్యాక్ సందర్శించనున్న నేపథ్యంలో ఐక్యూఏసీ డైరెక్టర్‌తో పాటు రిజిస్ట్రార్ పోస్టును కూడా భర్తీ చేశాం. న్యాక్ బృందం తనిఖీ అనంతరం పూర్తిస్థాయిలో మార్పులు జరుగుతాయి. యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి.. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పాలనను మెరుగుపరుస్తాం.
>
> – జీఎస్ శ్రీనివాస్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్

వివాదాస్పద తీరు..

కొంతకాలంగా అడ్మినిస్ట్రేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. గతంలో జరిగిన పలు అవకతవకలకు సిబ్బంది కూడా సహకరించినట్లు తెలుస్తుంది. పాత వీసీ మే నెలలో పదవీ విరమణ చేసిన తర్వాత ఐఏఎస్ అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ క్రమంలో చిన్నపాటి అవసరాల కోసం పెద్ద మొత్తంలో బిల్లులు పెట్టి డబ్బులు డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం అప్పట్లో ఉన్న అధికారులకు తెలిసినా ఏమీ అనలేదని తెలుస్తుంది. పలువురు కాంట్రాక్టర్లు, అఫ్లియేటెడ్ కళాశాల యాజమాన్యాలకు సంబంధించి బిల్లులు, ఫైల్స్‌పై పని జరగాలంటే పలువురి సిబ్బంది చేయి తడపాలన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న వీరి తీరు యూనివర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కేతేపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని రేమద్దుల, మాందాపూర్, మల్లాయిపల్లి, దొండాయిపల్లి, దావాజిపల్లి, కేతేపల్లి గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించనుందని పేర్కొన్నారు. కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని, నీడ కోసం టెంట్, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, డైరెక్టర్లు ఉస్మాన్, జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, రాముయాదవ్, బ్రహ్మయ్య, జయరాములుసాగర్, సీఈఓ భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సులో విశ్రాంత ఏఈ హఠాన్మరణం


తిమ్మన్న (ఫైల్)

జడ్చర్ల టౌన్/దేవరకద్ర: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విశ్రాంత ఏఈ అకస్మాత్తుగా మృతిచెందిన ఘటన జడ్చర్ల వద్ద గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేవరకద్రకు చెందిన విశ్రాంత ఏఈ తిమ్మన్న (65) హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. జడ్చర్ల బస్టాండ్‌కు చేరుకోగానే గుండెలో నొప్పి రావడంతో గుర్తించిన ప్రయాణికులు, డ్రైవర్ 108కు సమాచారం అందించి సీపీఆర్ చేశారు. బస్టాండ్‌కు చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బస్టాండ్‌కు చేరుకొని అంబులెన్స్‌లో మృతదేహాన్ని దేవరకద్రకు తీసుకెళ్లారు. తిమ్మన్న భార్య సుజాత ఆత్మకూర్ ఎంపీడీఓగా పనిచేస్తోంది. ఏఈ తిమన్న మృతితో దేవరకద్రలోని కురుమవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన గతంలో దేవరకద్ర, చిన్నచింతకుంట తదితర మండలాల్లో పంచాయతీ రాజ్‌శాఖ ఏఈగా విధులు నిర్వర్తించారు.

పాముకాటుతో మహిళ మృతి


నర్సమ్మ (ఫైల్)

మద్దూరు: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మద్దూరు పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. మద్దూరుకు చెందిన మ్యాతరి నర్సమ్మ (54) మధ్యాహ్నం పట్టణ శివారులోని తన పొలంలో పశువులకు మేత కోస్తున్న క్రమంలో ఏదో కరిచినట్లు అనిపించింది. అది గమనించకుండా అలాగే మేత కోసింది. కొద్ది సేపటికి కళ్లు తిరినట్లు కావడంతో అక్కడే ఉన్న తన భర్త పరమానందానికి విషయం చెప్పింది. వెంటనే వారు నాటువైద్యుడిని ఆశ్రయించారు. అక్కడ ఆమె పరిస్థితి విషమించడంతో మద్దూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి నారాయణపేట జిల్లా అస్పత్రికి వెళ్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలికి ఒక కుమారుడు, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

మనవరాలిని తీసుకెళ్లేందుకు వచ్చి అనంతలోకాలకు

జడ్చర్ల: హాస్టల్‌లో ఉంటున్న తన మనవరాలిని ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన అమ్మమ్మ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందింది. ఈ విషాదకర ఘటన జడ్చర్ల శివారులోని దేవునిగుట్ట తండా సమీపంలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం గ్రామానికి చెందిన తోటపల్లి మంజుల తన తల్లి చిట్టెమ్మ (45)తో కలిసి జడ్చర్ల శివారులోని దేవునిగుట్టతండా హాస్టల్‌లో ఉంటున్న తన కూతురును ఇంటికి తీసుకెళ్లడానికి బుధవారం వచ్చింది. సాయంత్రం 4 గంటల సమయంలో హాస్టల్ నుంచి బయల్దేరారు. సమీపంలోని జాతీయ రహదారిని దాటుతుండగా.. హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి చిట్టెమ్మను ఢీట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. మంజుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య


ఆర్మీ జవాన్ శివయ్య

బిజినేపల్లి: ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి మండలంలోని మమ్మాయిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నక్క శివయ్య(28) ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజుల కిందట శివయ్య రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. దీంతో మానసికంగా కుంగిపోయి ఇంట్లో బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఓవరాల్ చాంపియన్ లింగాల

- ముగిసిన అండర్-19 జోనల్‌స్థాయి క్రీడలు

లింగాల: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్-19 (బాలుర) క్రీడా పోటీల్లో లింగాల గురుకుల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అండర్-14 విభాగంలో అచ్చంపేట, అండర్-17 విభాగంలో జేపీ నగర్ గురుకులాల జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నాయి. నాలుగు రోజులపాటు పలు క్రీడాంశాల్లో జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి జిల్లాలోని 13 గురుకులాలకు చెందిన 1,105 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాసరావు, ఎస్‌ఐ నాగరాజు, ప్రిన్సిపాల్ బాలస్వామి హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

- చివరిరోజు జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అచ్చంపేట మొదటి, పెద్దకొత్తపల్లి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-17 విభాగంలో ఇటిక్యాల మొదటి, దేవరకద్ర ద్వితీయస్థానం, అండర్-19 విభాగంలో లింగాల మొదటి, ఇటిక్యాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-17 టెన్నికాయిట్ పోటీల్లో జేపీ నగర్ మొదటి, బాలానగర్ ద్వితీయ, అండర్-19 విభాగంలో బాలానగర్ మొదటి, జేపీ నగర్ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో జేపీ నగర్ మొదటి, బాలానగర్ ద్వితీయ, అండర్-17 విభాగంలో బాలానగర్ మొదటి, అచ్చంపేట ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-19 ఖోఖో టోర్నీలో జేపీ నగర్ మొదటి, మదనాపూర్ ద్వితీయ, అండర్-17లో దామరగిద్ద మొదటి, జేపీ నగర్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.


అండర్-17 కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న దేవరకద్ర, ఇటిక్యాల జట్లు


ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న లింగాల గురుకుల క్రీడాకారులు

జడ్చర్లలో ముగిసిన జోనల్‌స్థాయి క్రీడలు


షీల్డ్ అందుకుంటున్న ఊట్కూర్ విద్యార్థినులు

- విజేతలకు బహుమతులు ప్రదానం

జడ్చర్ల: మండలంలోని చిట్టెంబోయిన్‌పల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 10వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్ కళాశాలలకు చెందిన 680 మంది బాలికలు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాలకు అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలను నాలుగు రోజులపాటు నిర్వహించారు. క్రీడల ముగింపు కార్యక్రమానికి డీసీఓ వాణిశ్రీ, ఎంఈఓ మంజులాదేవి, ప్రిన్సిపాల్ అనిత హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

అండర్-17 వాలీబాల్‌లో విన్నర్‌గా నాచర్ల, రన్నర్‌గా నారాయణపేట జట్లు విజయం సాధించాయి. ఖోఖోలో ఊట్కూర్ జట్టు విన్నర్‌గా, మరికల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-19 హ్యాండ్‌బాల్‌లో మరికల్ విన్నర్‌గా, జడ్చర్ల రన్నర్‌గా, అండర్-14 కబడ్డీలో రాంరెడ్డిగూడెం విన్నర్‌గా, ఊట్కూర్ రన్నర్‌గా నిలిచాయి. ఖోఖోలో విన్నర్‌గా నాచర్ల, రన్నర్‌గా రాంరెడ్డిగూడెం, అండర్-14 టెన్నికాయిట్‌లో ఊట్కూర్ విన్నర్‌గా, మక్తల్ జట్లు రన్నర్‌గా నిలిచాయి. అండర్-19 చదరంగంలో మక్తల్ ప్రథమ, జడ్చర్ల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అండర్-19 లాంగ్‌జంప్‌లో లావణ్య (నాచర్ల) ప్రథమ, సంధ్యారాణి (జడ్చర్ల) ద్వితీయస్థానం, అండర్-17 విభాగం 1,500 మీటర్ల పరుగు పందెంలో దీనవతి (ఊట్కూర్) ప్రథమ, మహిమత కుమారి (జడ్చర్ల) ద్వితీయ, జయశ్రీ (జడ్చర్ల) తృతీయ స్థానాల్లో నిలిచారు.


బహుమతులు అందుకున్న విజేతలు

జాతీయస్థాయి కబడ్డీలో విజేతగా నిలవాలి

- మధ్యప్రదేశ్ తరలిన రాష్ట్ర బాలికల కబడ్డీ జట్టు



మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు రాణించి చాంపియన్‌గా నిలవాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గదర్‌వార్‌లో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 కబడ్డీ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు గురువారం జిల్లా నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర బాలికల జట్టును ఏఎంఓ అభినందించారు. జాతీయస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, పీడీలు జగన్‌మోహన్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 రాష్ట్ర కబడ్డీ బాలికల జట్టు

బి.నందిని (మహబూబ్‌నగర్), బి.సోనాలి (ఆదిలాబాద్), బి.హని (ఖమ్మం), ఎండి.అఫ్షా (నల్గొండ), ఆర్.శివమణి (మహబూబ్‌నగర్), జి.మైత్రి (ఖమ్మం), వి.సాక్షి (రంగారెడ్డి), వి.స్వర్తిక (ఆదిలాబాద్), జె.గంగ (మహబూబ్‌నగర్), వి.పూజ (నల్లగొండ), కె.వందన (కరీంనగర్), జి.కావేరి (మహబూబ్‌నగర్), కోచ్‌గా జి.శివాని, మేనేజర్‌గా కురుమయ్య వ్యవహరిస్తున్నారు.

జోనల్ క్రీడల్లో గోపాల్‌పేట క్రీడాకారుల ప్రతిభ..

గోపాల్‌పేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల జోనల్‌స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. నాలుగు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 11 గురుకులాలకు చెందిన 935 మంది విద్యార్థినులు పాల్గొని ఫుట్‌బాల్, వాలీబాల్, చెస్, ఖోఖో, క్యారమ్స్ తదితర క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-19లో మొత్తం 86 పాయింట్లు సాధించి గోపాల్‌పేట ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. కీర్తన ఇండివిజువల్ చాంపియన్‌షిప్ సాధించింది. అండర్-17లో కొల్లాపూర్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మధుప్రియ ఇండివిజువల్ చాంపియన్‌షిప్ సాధించింది. అండర్-14లో మన్ననూరు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలవగా.. రమంతి ఇండివిజువల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. ముఖ్య అతిథులుగా హాజరైన డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. అండర్-19 విభాగంలో 3కే రన్, 1500 మీటర్లు, 800 మీటర్లు, 400 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలో అత్యంత ప్రతిభ కనబర్చిన వెల్దండ పాఠశాలకు చెందిన కీర్తనను అందరూ ప్రత్యేకంగా అభినందించారు.


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన గోపాల్‌పేట జట్టుకు బహుమతి అందజేస్తున్న డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉర్కొండ మండలం ముచ్చర్లపల్లికి చెందిన ఒక్క చంద్రశేఖర్ (28) బైక్‌పై జడ్చర్ల నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుటకు రాగానే గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

కడుకుంట్ల స్టేజీ వద్ద..


మందడి శివకుమార్ (ఫైల్)

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా కడుకుంట్ల స్టేజీ సమీపంలోని ఎన్‌హెచ్-44పై గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్తకోట మండలం అమడబాకుల గ్రామానికి చెందిన మందడి శివకుమార్ (23) పామాపురం గ్రామంలో ఉంటున్న మేనమామను చూసేందుకు బుధవారం బైక్‌పై వెళ్లాడు. పామాపురం నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. అర్ధరాత్రి కుడుకుంట్ల స్టేజీ సమీపంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుడి భార్య ఎం.శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

702 కిలోల బెల్లం పట్టివేత

మహబూబ్‌నగర్ క్రైం: ఎలాంటి అనుమతి లేకుండా డీసీఎం వాహనంలో తరలిస్తున్న బెల్లం, నవసాగరంను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గురువారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని బైపాస్ చౌరస్తా రోడ్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మహబూబ్‌నగర్ సాయిరాం పార్సిల్ సర్వీస్‌కు చెందిన డీసీఎంలో 702 కిలోల బెల్లం, 20 కిలోల నవసాగరం గుర్తించామని తెలిపారు. డీసీఎంలోని కిరాణ సామగ్రి అన్నింటికి రసీదులు ఉండగా.. బెల్లం, నవసాగరానికి మాత్రం ఎలాంటి రసీదులు లేవని చెప్పారు. డ్రైవర్ మహేష్‌ను అదుపులోకి తీసుకొని వాహనంతో పాటు బెల్లం, నవసాగరం సీజ్ చేశామని వెల్లడించారు. పట్టణంలోని టీడీగుట్టకు చెందిన రాములు, హన్వాడకు చెందిన రాజు ఆర్డర్‌పై హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తున్నట్లు విచారణలో తేలిందని.. ఆ ఇద్దరు కొన్నిరోజులుగా సారా తయారు చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలోని చాలామంది సారా తయారీదారులు తమ వ్యక్తిగత వాహనాల్లో బెల్లం తీసుకురాకుండా పార్సిల్ వాహనాల్లో రవాణా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ శారద, ఎస్‌ఐలు సృజన, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సీజ్ చేసిన బెల్లం వాహనం

ఐటీసీతో పీయూ ఒప్పందం


ఐటీసీ సంస్థ ప్రతినిధులతో ఎంఓయూ చేసుకుంటున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఐటీసీ అకాడమీతో గురువారం హైదరాబాద్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు తమిళనాడు ఐటీ మినిస్టర్ త్యాగరాజన్, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ ఎంఓయూ పత్రాలు మర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా ఐటీసీ అకాడమీలో సిబ్బందికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసం.. రూ.4.77 లక్షలు మాయం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తిని సైబర్‌నేరగాళ్లు మాయమాటలతో మభ్యపెట్టి నగదు కాజేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత నెల 28న ఫెడెక్స్ అనే అంతర్జాతీయ కొరియర్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని ఓ మహిళ వాట్సాప్ ఫోన్ చేసింది. మీకు రావాల్సిన కొరియర్‌ను ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని.. దాంట్లో ఒక ల్యాప్‌టాప్, ఒక హార్డ్‌డిస్క్, 200 గ్రాముల డ్రగ్స్ ఉంటే సీజ్ చేశారని తెలిపింది. ఆ వెంటనే వీడియో కాల్ చేసి ఆన్‌లైన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైందని నకిలీ పత్రాలను చూపించి అతడి నుంచి గంటల వ్యవధిలో రూ.4.77 లక్షల నగదును కాజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు కళ్లెం..

మహబూబ్‌నగర్ క్రైం: సైబర్ నేరగాళ్లు ఓ బ్యాంకులో పనిచేసే ఉద్యోగి ఖాతాలో నుంచి డబ్బులు మాయం చేయడానికి యత్నించగా.. ఉద్యోగి అప్రమత్తమై తన ఖాతాలో ఉన్న డబ్బును కాపాడుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకులో పనిచేసే మహిళా ఉద్యోగిని ఖాతాలో ఉన్న రూ. 4.20 లక్షలను మాయం చేయడానికి సైబర్ నేరగాళ్లు ప్రయత్నించారు. అప్రమత్తమైన సదరు ఉద్యోగిని బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లింది. ఆ తర్వాత సైబర్ క్రైం పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి ఖాతాలో ఉన్న రూ. 4.20 లక్షలను ఫ్రిజ్ చేశారు.

ఆటోమొబైల్ ట్రాఫిక్ లోడింగ్‌కు ఎన్‌ఎంజీ రేక్ నిర్మాణం



జడ్చర్ల టౌన్ (బాలానగర్): హైదరాబాద్ డివిజన్‌లో మొదటిసారిగా ఆటోమొబైల్ ట్రాఫిక్‌ను లోడ్ చేసేందుకు బాలానగర్ రైల్వేస్టేషన్‌లో ఎన్‌ఎంజీ రేక్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాన్ని దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుధ్ పామర్ గురువారం పరిశీలించారు. రాజాపూర్ మండలంలోని కీటోమోటర్స్ ప్లాంట్ నుంచి ఢిల్లీ డివిజన్‌లోని ఉత్తర రైల్వేకు ఎలక్ట్రిక్ ఆటోలను లోడ్ చేసేందుకు రేక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 450 టన్నుల బరువుగల ఆటోలను 1770 కి.మీ. రవాణా చేసేందుకు గాను రూ. 17.5లక్షల ఆదాయం రైల్వేకు సమకూరనుందని చెప్పారు. ఆటోల లోడింగ్‌ను కీటోమోటర్స్ ప్రతినిధులతో కలిసి డీఆర్‌ఎం పరిశీలించారు. మరో 6 రేక్‌ల ఆటోలు లోడ్ అవుతాయని ప్రతినిధులు డీఆర్‌ఎంకు తెలియజేశారు.

రాష్ట్రపతిని కలిసిన నవాబుపేట విద్యార్థులు

నవాబుపేట: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నవాబుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిశారు. మారుమూల ప్రాంత విద్యార్థులకు రాష్ట్రపతిని కలిసే అవకాశం రావడంతో ఆనందంతో ఉప్పొంగారు. మొత్తం 22 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం రాష్ట్రపతిని కలిసినట్లు ఎంఈఓ నాగ్యానాయక్ తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 590 క్యూ సెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,331 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీ ఎంసీలు కాగా ప్రస్తుతం 9.316 టీఎంసీల నీరు ఉంది.

పూర్తిస్థాయిలో రామన్‌పాడు జలశయం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కాగా.. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,180 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 107 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన కురుమతిగిరులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలి వస్తున్నారు. గురువారం ఉదయం భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులుతీరి కనిపించారు. కొందరు భక్తులు మెట్లపై దీపాలు వెలిగించగా.. మరికొందరు గోవింద నామస్మరణతో కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం అలువేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపం వద్ద దర్శించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో దాసాంగాలు పెట్టి గండదీపాలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. జాతర మైదానంలోని దుకాణాల్లో భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.